# నెత్తుటి పండు

– డా. పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి

ఈరోజు సృష్టిలో జరగకూడని విషాదం మరొకటి జరిగింది. ఇది పేపర్‌కు కొత్త కాదు. వార్తలలో జనం చదవనిదీ కాదు. కానీ... ఇది ఘోరం... ఇది అన్యాయం... ఇది అవాంఛనీయం.

ఈరోజు ఒక శతవృద్ధుడు తొలి వెలుగు రేఖలు చూడక ముందే హత్య చేయబడ్డాడు. సూర్యుడితో పాటు పోలీసులు వచ్చారు. ఆయన ఇద్దరు కూతుళ్ళు, ఒక్కగానొక్క కొడుకు... కాస్త ఎక్కువ-తక్కువలుగా ముగ్గురూ ఏడుస్తున్నారు.

"ముగ్గురు బిడ్డలు వున్నా పాపం అనాథగా అస్తమించాడు" అక్కడ చేరిన గుంపులో నుంచి ఒకామె జాలిపడింది.

"ఇంత ముసలాణ్ణి చంపడానికి వాడికి చేతులెలా వచ్చాయో!" చలించిపోతూ అన్నాడు మరొకడు.

"డబ్బు... డబ్బురా. ఈ ముసలాడు ఇనప్పెట్టెలో పెద్దమూటే దాచాడంట." ఆ విషాదంలో కూడా జోక్ విసిరాడు మరొక అతను.

"ఎంత డబ్బాశ అయితే మటుకు వయసుకు విలువివ్వాలి కదా!" నిట్టూర్చింది ఒక మధ్య వయస్కురాలు.

"అట్టయినా డబ్బేం పోలేదంట కదా! మరి ఎందుకు చేసినట్టో ఆ దుర్మార్గుడు ఈ ఘాతుకాన్ని?"

ఎవరి సందేహాలలో వాళ్ళున్నారు.

"ఎవరు చేసుంటారంటావ్?" పక్కవాణ్ణి గిల్లి మరీ అడిగాడు తిరుపతి నాయుడు. అతను ఆ వృద్ధుడి కొడుకు... చంద్రం పొలాల దగ్గర కాపలా మనిషి.

"ఏమో! రేపటికి గాని తలాతోక తెలీదు..." జనాలకు తమ ఇళ్ళల్లో జరగాల్సిన అవసరాల పట్ల శ్రద్ధ కంటే పక్కవాడి బతుకుల్లో లొసుగుల మీదే ఆసక్తి ఎక్కువ.

లోపల పోలీసులు ఈ శతవృద్ధుడి హత్య కేసు గురించిన కూపీ లాగి ప్రమోషన్ కొట్టేయాలని తపన పడ్తున్నారు. మరోప్రక్కన విలేకరులు ఈ దురాగతాన్ని సెంటిమెంట్‌కు జోడించి పేపర్లకు ఎక్కించి, జనాల్లో సంచలనాన్ని సృష్టించి పేపర్ సర్క్యులేషన్ పెంచుకోవాలని చూస్తున్నారు. లోకల్ పేపర్ విలేకరి అయితే అప్పటికప్పుడే ఆ వార్తకు హెడ్‌లైన్ కూడా పెట్టేసాడు. "కాటికి కాళ్ళు చాపుకున్న శతవృద్ధుడి హత్య"...

అక్కడ అంతమందిలో మాట్లాడనిది ఒకే ఒక్క వ్యక్తి... అతను... లోపల హాల్‌లో హత్య గావించబడి అస్తవ్యస్తంగా పడున్న గోవిందరావు శవం. దానికి తిరిగి ప్రాణం రావాలే కాని... అది చాలా మాట్లాడుండేది.

ఆ మాట్లాడని శవం చుట్టూ గీతలు... శవం మీద కెమెరా ఫ్లాష్‌లు... శవం పక్కన శవ పంచాయతీ... ప్రశ్నలు, జవాబులు వూహాగానాలు... క్షణంలో ఆరిపోయే నిర్ణయాలు...

"అయితే... మీకు ఎవరి మీదా అనుమానం లేదంటారా?" ఇంటి ముందు వరండాలో దిగులుగా నిల్చొని వున్న ముగ్గురు బిడ్డలు కంట తడిపెడుతూ తలలు అడ్డంగా వూపారు.

"మీకు శత్రువులు ఎవరూ లేరా?"

"ఒకవేళ వున్నా ఆయన్ను చంపితే వాళ్ళకి ఏమొస్తుంది?" అన్నాడు కొడుకు చంద్రం.

"ఏమో! డబ్బు పాపిష్టిది... దానివల్ల నాన్నకు ఎవరైనా శత్రువులయ్యారేమో!..." కళ్ళు తుడుచుకుంటూ అంది పెద్ద కూతురు మాధవమ్మ.

"మొన్న నేను వచ్చినప్పుడు నాన్నతో చెప్పానక్కా. నీకు మేమంతా లేమా? ఇంకా నీకు డబ్బు యావ ఎందుకు? నువ్వుండగానే తలా కాస్త ఇచ్చేయరాదా? అని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. అలా చేసున్నా ఇంత ఘోరం జరక్కపోను" అని ముక్కు చీదేసింది ముగ్గురు కూతుళ్ళ తల్లి రాఘవమ్మ. ఆమె ఆ వృద్ధుడి రెండో కుమార్తె.

ఆమెవైపు అనుమానంగా చూస్తూ అడిగాడు యస్.ఐ.

"మీకు ఆయన ఇంకా ఆస్తి పంచలేదా?"

"ఎందుకని? మా తమ్ముడికి పెళ్ళయిన కొద్ది రోజులకే సగం ఆస్తి ఇచ్చేశాడు."

"మరి మీ ఇద్దరికీ?!" యస్.ఐ. చూపుల్లో అనుమానం ఇంకాస్త పెరిగింది.

"మాకు మా పెళ్ళిళ్ళప్పుడే ఇచ్చేసాడు... మిగతా ఆస్తిని ఇంకంత చేశాడు."

"అయితే... ఇప్పుడు మీకు ఆయన ఆస్తిలో భాగం రాదన్న మాట" ఆమె వంక నిశితంగా చూస్తూ అడిగాడు యస్.ఐ.

ఆమె మాట్లాడలేదు కానీ పక్కనే వున్న మరెవరో అన్నారు...

"అది ఆయన స్వార్జితం. ఆయన వ్రాసుంటే వస్తది."

"మిమ్మల్ని అడిగానా? మీకు ఇక్కడేం పని?" యస్.ఐ. కసరడంతో ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు... అప్పుడే బంధుజనం బిలబిలమంటూ దిగారు.

బంధుత్వంలో ఓ తమాషా వుంది. వాళ్ళల్లో ఒకరు ఎదిగితే మరొకరు చూడలేరు కానీ, చావుకు-పుట్టుకకు మాత్రం తప్పకుండా హాజరవుతారు.

"అయ్యో! అన్నయ్యా! నువ్వెళ్ళిపోయావా? నాకు ఎప్పుడొస్తుందో పిలుపు?" ఏడుస్తూ రెండు చేతులు చాపి లోపలకు పోబోతున్న గోవిందరావు గారి చెల్లెల్ని అటకాయించి, హాస్యమాడాడు ఆ వృద్ధురాలి అల్లుడు గురిగింజ గురవయ్య. అతని వసనత్వమే అతనికి ఇంటి పేరులాగ స్థిరపడిపోయింది.

"అప్పుడే ఏడకత్తా నువ్వు పోయేది?... మేము కూడా పోయే దాకా... నీకిప్పు డిప్పుడే పిలుపు రాదులే."

అతని హాస్యం వెనుక చాలా నికృష్టమైన దెప్పిపొడుపు వుంది. "ఆమె తన ఆస్తిని మొత్తం తన కొడుక్కే ఇచ్చేసింది. అప్పుడప్పుడు కూతురు దగ్గరకొచ్చి తేరగ వచ్చిన తిండి తినేసి పోతుంటుంది" ఇది అతని దుగ్ధ. అతను గతం మర్చిపోయాడు. ఆమె తన భర్తకు, బిడ్డకు తెలీకుండా... కూతురికి ఇల్లు దోచిపెట్టిన సంగతి మర్చిపోయాడు... తన తల్లి... ముందు ముందు ఏవీ ఇవ్వక్కరలేదని నిర్లజ్జగా కట్నం వసూలు చేసిన విషయం మర్చిపోయాడు... పండగ పండక్కీ... తాను అలిగి, అడిగి విలువైన బహుమతులు పొందిన వైనం మర్చిపోయాడు... పురుడు పురుడికీ అత్త ఒంటి మీద నగలు తన బిడ్డల ఒంటి మీదకు ఎలా వచ్చాయో మర్చిపోయాడు. ఇప్పుడు అత్తకు పెట్టే నాలుగు మెతుకులు అతనికి బరువైపోయాయి. తనదైన సమర్థతతో సంపాదించే ఉపాయం ఆలోచించకుండా... ఎవరిని దోచుకుని తిందామా?" అని కుయుక్తులు పన్నే వంకర తెలివితేటలు గల చాలామంది మనుషులకు ప్రతినిధి అతను.

వెనుక పడిపోతున్న పోలీసుల్ని ఈడ్చుకుంటూ వస్తున్నాయి పోలీసు కుక్కలు.

"కుక్కల్ని విజయవాడ నుండి తెచ్చారట."

"హంతకుడెవరో ఈరోజే తెలిపోతుంది."

"శవం మీద చాలా కత్తిపోట్లున్నాయట."

"పాపం ఆ ముసలాడు ఆఖరి క్షణంలో ఎంత గిలగిలలాడి పోయాడో... హంతకుణ్ణి వూరికే వదలకూడదు."

"నో డవుట్. కుక్కలు వాసన పట్టేస్తాయి"

తలా ఒక రకంగా మాట్లాడుతున్న జనాన్ని విభ్రాంతిలో ముంచుతూ కుక్కలు వృద్ధుడి కొడుకు చంద్రం మీదకు దూకేశాయి. అతను తృళ్ళిపడ్డాడు... ఆశ్చర్యపోయాడు... తర్వాత తేరుకుంటూ అన్నాడు.

"నేను లోపల శవం దగ్గరకెళ్ళొచ్చాను కదా!... వాసన చూస్తున్నట్టున్నాయి."

"అయ్యుంటుంది" అనేసి తన పనిలో తాను నిమగ్నమైపోయాడు యస్.ఐ.

కుక్కల్ని లోపలికి తీసుకెళ్ళారు. ఆ శవం చుట్టూ తిరిగి బయటకొచ్చాయి అవి. మరలా చంద్రం మీదకు ఎక్కబోయాయి. పోలీసులు వాటిని వెనక్కు లాగారు. అలా లాగబడ్డ విశ్వాసాన్ని తమ ఊపిరిలో ఐక్యం చేసుకున్న జాగిలాలు మరో దిక్కుకు పరుగెట్టాయి. వాటి వెంట పోలీసులు. అటూ ఇటూ తలలూపుకుంటూ వాసన చూస్తూ



వెళ్ళిన కుక్కలు ఒక ఇంట్లో జొరబడ్డాయి. పోలీసుల్ని చూడగానే... అక్కడే జనం గుమిగూడారు... అక్కడ ఈనాడు శవమైన ఆ వృద్ధుడు ఒకనాడు... తన ఒక్కగానొక్క కొడుకు కోసం ఎన్నో ఆశలతో కట్టుకున్న ఇల్లు అది... ఆ ఇంట్లో వుంటున్నది చంద్రం... చంద్రం భార్య... అతని పిల్లలు ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. జనంలో ఆసక్తి పెరిగింది. కుక్కలు చంద్రం భార్య జోలికి పోలేదు.

"అయితే ఈ హత్య చేసింది చంద్రం అయ్యుంటాడా?"

"రేపోమాపో కాటికెళ్ళే వాడిని చంపాల్సిన అవసరం ఏమిటి?"

"కుక్కలు పొరపాటు పడుంటాయి."

"తండ్రికి కొడుక్కి మధ్య మాటామాటా పెరిగి ఆవేశంలో..."

"ఎంత ఆవేశపయితే మాత్రం... చంపేయాలా?... ఉహు అలాంటిదయ్యుండదు"

జనాలు ఎవరి ఊహాగానాల్లో వాళ్ళున్నారు. ఎవరి నిర్ణయాలు వాళ్ళు తీసుకుంటున్నారు. మధ్యమధ్యలో జనాల్లో పెరిగిపోతున్న కుళ్ళు బుద్ధుల గురించి చర్చించుకుంటున్నారు.

జనం తేరుకునే లోపల చంద్రాన్ని ఆ ఇంటికి తీసుకొచ్చాడు యస్.. వెంటనే కుక్కలు చంద్రాన్ని చుట్టుముట్టేశాయి. జనాలు విభ్రాంతి నుండి తేరుకోక ముందే... పోలీసు దెబ్బలు రుచి చూసిన చంద్రం నిజం ఒప్పేసుకున్నాడు.

"కాటికి కాళ్ళు చాచుకున్న తండ్రిని ఆస్తి చేతికి

రావడం కోసం చంపాలా?"

"చంపి ఆ ఆస్తిని ఎవరికిస్తాడు? కొడుకులకే కదా! వాళ్ళు రేప్పొద్దున ఈడిని చంపితే..."

"పాపిష్టోడా! ఎంత పని చేశావురా?"

"నీ ముఖం చూస్తేనే పాపం చుట్టుకునేలా వుంది."

రక్త సంబంధీకుల దూషణలు, బంధువుల చీత్కారాలు అతన్ని అంటడం లేదు. తను నివాసముండబోయే జైలు దృశ్యం అతని కళ్ళెదుట కనిపిస్తోంది. అతని తలవాలిపోయింది కానీ అతని మెదడు మాత్రం ఇంత జరిగినా పశ్చాత్తాపడడం

# హిందీ హైకూలు

చుక్కలు మాయం
వెదుకుతూ చంద్రుడు
అమావాస్యకై

మనిషిన్నేను
అవునందర్కీ తెల్సు
నేనే మర్చాను

టీవి తెస్తుంది
అక్రమ చుట్టరికం
కోర్కె మదిలో

అమ్ముడౌతోంది
కూడళ్ళలో ఆడది
ప్రకటనల్లో

మనసు బావి
కోర్కెలతో నిండుంది
ఖాళీ అవలా

-హిందీ: శ్యామ్‌ఖరే
తెలుగు: మాధవీ సనారా

లేదు. 'శిక్ష నుండి ఎలా తప్పించుకోవాలా?' అని ఆలోచిస్తోందది. చంద్రం బిత్తర చూపుల్లో చావు భయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"ఈ ముసలాడు అనుభవించాల్సిందంతా అనుభవించేశాడు కదా! ఆ మిగిలిందేదో ఆడి మొహాన కొట్టుంటే... ఈ భూమ్మీద ఇంక నాలుగు నాళ్ళు నూకలుండేవి కదా!"

చిత్రం! ఈ సంఘటన ఆ గుంపులో వున్న ఒక మధ్య వయస్కురాలిలో జ్ఞానోదయాన్ని కలిగించింది.

"తొంబై ఏళ్ళ వాడికీ బతకాలనే ఆశ... ఆరు పదులు దాటిన వాడికీ అదే ఆశ. కష్టాల ఊబిలో కూరుకుపోయిన వాడికి, కుష్టువాడికి, ముష్టివాడికీ... అందరికీ అదే ఆశ... మరి ఏ కష్టంలేని తనకెందుకు అప్పుడప్పుడూ ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోంది!?" ఆమె తనని తాను ఆత్మపరిశీలన చేసుకోవడంలో పడిపోయింది...

వృద్ధుడి శవం మీద వేయబడ్డ అభాండాన్ని ఖండించాడు మరొకతను.

"అంటే... నీ ఉద్దేశం కొడుకులు పెడ్తే తిని, తిడ్తే పడుండి, ఒంటి మీదకు రోగం వస్తే.. 'అనవసరపు ఖర్చ'ని కొడుకు వదిలేస్తే, మంచానికి అంటుకుపోయి చావు కొరకు మాత్రమే ఎదురుచూస్తూ బతకాలా? అంతకంటే ఈ చావే మేలు. మేనుకి, మనసుకి కూడా నొప్పి తెలీదు."

చంద్రాన్ని ఎక్కించుకున్న జీప్ వెళ్ళిపోయినా జనాల్లో విభ్రాంతి పోలేదు.

"వయసు లేదు. భార్య లేదు. తోడుంటారనుకున్న బిడ్డలు తరిమేశారు. తన బతుకేదో తను బతుకుతున్నాడు. అట్టాటోడిని చంపడానికి చేతులెలా వచ్చాయో!... పాపిష్టోడు."

ఎంతిశ్వాసం లేకపోయిందో ఈ అయ్యకు! ఈయన తల్లిగోరు ఎన్ని కష్టాలు పడిందో ఈనగోర్ని ఈ భూమ్మీదేయను?!

శతవృద్ధుణ్ణి చంపి రికార్డు సృష్టించిన చంద్రాన్ని ఛీత్కారం చేసిన డెబ్బై ఏళ్ళ వృద్ధురాలి వైపు చూశారు అందరూ.

'ఏం బాధలు పడింది?' అని ఎవ్వరూ అడగలేదు. నడుం ఒంగిపోయిన ఒకనాటి ఆ

ఇంటి నౌకరు భార్య లక్ష్మి మాత్రం కథలు కథలుగా ఆమె చరిత్రను అందరి ముందు వుంచింది.

ఎప్పుడో ఈ బంధాల్ని వదిలేసి వెళ్ళిన అనసూయమ్మ. నిన్నటివరకు సజీవంగా వున్న గోవిందరావు గారు... వీరికి బిడ్డలు పుట్టడమే చాలా ఆలస్యంగా పుట్టారు. చంద్రానికి ముందు ఇద్దరు ఆడపిల్లల్ని కని రెండుమార్లు నిరాశపడ్డ దంపతులు వాళ్ళు. మగబిడ్డ కోసం ఎదురు చూస్తున్న రోజుల్లో అనసూయమ్మకు గర్భం, గుండెజబ్బు రెండూ ఒకేసారి వచ్చాయి. డాక్టర్లు పెరిగిపోయిన ఆమె గుండె కాస్పుకు తట్టుకోలేదనీ, గర్భం తీసేయాలనీ చెప్పారు. ఇది అరవై ఏళ్ళ నాటి మాట. వైద్యం ఇంతగా ఎదగని రోజులవి. అనసూయమ్మ గాఢంగా నమ్మింది. తన మొక్కులు ఫలించి, తన గర్భంలో మగబిడ్డే పెరుగుతున్నాడని. గోవిందరావు మాత్రం భయపడ్డాడు. ఆయనకు భార్య ప్రాణాలు కావాలి. కానీ ఆమెలోని చిక్కటి ఆశ భర్తను కూడా ఎదిరించేలా చేసింది. ప్రాణం పోయినా సరే తనకు వంశాంకురం కావాలని మొండికేసింది. ఒకప్రక్క ప్రసవం- లోపల ప్రాణం పోకుండా వుండడానికి మందులు మింగుతూనే... మరోపక్కన కడుపులో బిడ్డను పెంచి భూమ్మీద వేసింది.

కథ విన్నాక కుతూహలంగా అడిగారు ఒకరు.

"ఇవన్నీ నీకెలా తెలుసు?"

"అప్పుడు నేను ఆళ్ళింట్లో పని మనిషిని. అప్పుడు నాకు పదేళ్ళు" అని బోసి నోరంతా తెరిచి నవ్వింది ఆమె. తన బాల్యాన్ని తలచుకుని పరవశిస్తూ.

శరీరానికి వయసు రావడానికి చాలాకాలం పట్టొచ్చు. కానీ మనసుకు ఒక్క క్షణం చాలు మధురమైన బాల్యంలోకి వెళ్ళిపోవడానికి.

"ఆ తర్వాత...?"

"ఆ తర్వాతేమైంది?... అమ్మ చేతుల్లో పెరిగాడు. అయ్య భుజం మీద ఆడి పెద్దోడయ్యాడు. ఇదిగో... ఇప్పుడు అబ్బునే హత్య చేశాడు."

"ఈ హత్య ఎందుకు చేశాడు?"

ఫెళ్ళున నవ్వింది ఆమె.

"అర్గో... ఆ పక్క ఈదిలో శవమై పడున్నాడే ఆయనకు ఆఖరి ఛణంలో ఎందుకు హత్య చేశాడో తెల్సే వుంటది. పొయ్యి అడుగు."

నిజంగా ఆ శవానికి ఐదు నిమిషాల పాటు మాట్లాడే శక్తే వస్తే...

"నువ్వు లేకుండా నేను హాస్టల్‌లో వుండలేను" అని మారాం చేస్తే నీ చదువు కోసం నా మకాం నీ దగ్గరకు మార్చాను. ఇప్పుడు నీ దగ్గర నుండే కాకుండా ఈ భూమ్మీద నుండే తరిమేస్తున్నావురా ఛండాలుడా!" అని ఛీత్కరిస్తుంది.

"ఉందో లేదో తెలీని పున్నామ నరకాన్నుండి రక్షించడానికి నాకే కాదు మరెవ్వరికీ భూమ్మీదే నరకాన్ని సృష్టిస్తున్న ఇలాటి కొడుకులు వద్దు" అనిపిస్తుంది.

"కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి అబార్షన్లు చేయించుకుంటున్న తల్లుల్లారా! కళ్ళు తెరవండి" అని హెచ్చరిస్తుంది.

"నిన్ను పెంచి పెద్ద చేయడానికి ఎంత మంది కాళ్ళు పట్టుకున్నానో... నీ కోరికలు తీర్చను నేను ఎంత దిగజారిపోయానో... నిన్ను గొప్పవాడిగా చూడడానికి నేను ఎంత మంది ఉసురు పోసుకున్నానో!... ఇవన్నీ గుర్తుకు తెచ్చుకుని పశ్చాత్తాపపడుతున్నాను'' అని నిజం ఒప్పుకుంటుంది.

"నిన్ను కన్న నాన్నగానైనా నన్ను కరుణించని నీ నీచత్వం నా కళ్ళు తెరిపించి, ఈ ఆస్తిని అనాథలకు వ్రాసేలా చేసింది" అని బిడ్డకు కృతజ్ఞతలు తెల్పుకుంటుంది.

ఇక్కడ భూమ్మీద ప్రాణం వున్న మనుషులు ఇన్ని విధాలుగా ఆలోచిస్తుంటే... పైన శూన్యంలో వున్న ఈ వృద్ధుడి భార్య అనసూయమ్మ నిర్జీవమైన గుండె ద్రవించింది.

"అయ్యో నాయనా! మీ నాయనకు భూమ్మీద నూకలు చెల్లను ఇంక ఆట్టే కాలం లేదు. ఇంతలో త్వరపడి ఆయన్ని హత్య చేసి జైలుపాల పడ్డావు కదయ్యా!"

"తన బిడ్డను తడిమి ఓదార్చను తనకు ఆకారం లేకపోయిందే" అని వాపోయింది ఆ తల్లి. ■